క్లుప్తంగా

గ్రంథాలయాలను వినియోగించుకోండి



తెనాలి రూరల్: సంగం జాగర్లమూడి శాఖా గ్రంథాలయాన్ని ఉమ్మడి గుంటూరు జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి. సుబ్బరత్నమ్మ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఎక్కువ మంది పాఠకులు గ్రంథాలయ సభ్యత్వం తీసుకోవటంతో పాటు గ్రంథాలయాన్ని వినియోగించుకునే విధంగా చేయాలని గ్రంథాలయాధికారి జమ్ముల వెంకటేశ్వరరావును ఆదేశించారు. గ్రంథాలయ సేవలు అందుతున్న తీరుపై పాఠకులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రంథాలయ భవనాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణం చేపట్టడానికి స్థల సేకరణ కోసం ప్రయత్నం చేయాలని గ్రంథాలయాధికారిని ఆదేశించారు.

అపార్ట్‌మెంట్ నుంచి కింద పడిన వృద్ధురాలికి గాయాలు



తెనాలిరూరల్: అపార్ట్‌మెంట్ నుంచి పడి వృద్ధురాలు తీవ్ర గాయాల పాలైన ఘటన తెనాలిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ కొత్తపేటలోని అష్టలక్ష్మి గుడి పక్కన ఉన్న అపార్ట్‌మెంట్ 4వ అంతస్తులో 65 ఏళ్ల బెజవాడ త్రివేణి తన కుటుంబంతో నివసిస్తోంది. అనారోగ్యంతో బాధ పడుతున్న ఆమె ప్రమాదవశాత్తు పై నుంచి కిందపడి తీవ్ర గాయాలపాలైంది. ప్రకాశం రోడ్డులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా మెరుగైన చికిత్స కోసం తాడేపల్లిలోని వైద్యశాలకు పంపారు. వన్‌టౌన్ పోలీసులు త్రివేణి కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు.

మల్లేశ్వరరావు సేవలు అభినందనీయం



తెనాలి అర్బన్: తెనాలి మున్సిపల్ ఇంజినీర్‌గా పనిచేసి పదోన్నతిపై తాడేపల్లి వెళ్లిన కొడాలి నాగమల్లేశ్వరరావు సేవలు అభినందనీయమని పలువురు కాంట్రాక్టర్లు కొనియాడారు. చెంచుపేటలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి నాగ మల్లేశ్వరరావు అభినందన సభను నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంతగానో పని చేసిన ఆయనకు మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పదోన్నతి లభించడం సంతోషకరమన్నారు. అనంతరం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కాంట్రాక్టర్లు రావి దత్తు, పాటిబండ్ల గోపి, రాయపాటి శ్రీనివాస్, మేకల సురేష్, మేకల రవి, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి క్రికెట్ ఎంపిక పోటీలు



తెనాలి అర్బన్: యువ క్రికెట్ అకాడమీ ఆధ్వర్యంలో గురువారం నుంచి క్రికెట్ టీమ్ సెలక్షన్ పోటీలను వివిధ పాఠశాలలో నిర్వహించనున్నట్లు కోచ్ మాలిక్ తెలిపారు. చెంచుపేటలోని ఆర్‌పీఎం క్లబ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన అకాడమీ కార్యాలయాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులను పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సునీల్, ఇన్‌చార్జ్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పలు చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

గుంటూరు ఈస్ట్: పలు చోరీ కేసుల్లో నిందితుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్టు చేశారు. ఎస్‌హెచ్‌ఓ విజయచంద్ర బుధవారం పోలీసు స్టేషన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌కు చెందిన కోనూరి శ్రీనివాసరావు గతంలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ దొంగ బంగారం విక్రయించి పెట్టడంతో ఓ వ్యక్తికి సహాయపడి అరెస్టు అయి జైలుకు వెళ్లాడు. 2023 సెప్టెంబరులో మంగళగిరి రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో, అదే నెలలో గుంటూరు పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో, 2024 మార్చిలో పట్టాభిపురం పోలీసు స్టేషన్ పరిధిలో ఒక ఇంట్లో చోరీలు చేశాడు. అదే నెలలో పొన్నూరు టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలో రెండు చోరీలు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు బుధవారం నిందితుడు శ్రీనివాసరావును అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి ద్విచక్రవాహనం, 39 గ్రాముల బంగారు, 353 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచగా, న్యాయమూర్తి రిమాండ్‌కు తరలించారు.

పింఛను కోసం పండుటాకుల పడిగాపులు

- ఉదయం నుంచి సచివాలయాల వద్ద వేచి ఉన్న లబ్ధిదారులు
- తెనాలి పట్టణంలో ప్రారంభమైన సామాజిక పింఛన్ల పంపిణీ

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ఉద్యోగులు తమ సచివాలయాల వద్దకు వచ్చిన లబ్ధిదారులకు సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు. తెనాలి పట్టణంలోని 40 వార్డుల పరిధిలోని సచివాలయాల వద్దకు బుధవారం ఉదయం లబ్ధిదారులు పింఛన్ల కోసం వచ్చారు. వేసవి తీవ్రత ఉండటంతో అధికారులు టెంట్లు, కుర్చీలను సచివాలయాల ఆవరణలో వేయించారు. దీంతో లబ్ధిదారులు సచివాలయాల ముందు ఉన్న కుర్చీల్లో గంటల కొద్ది వేచి ఉండాల్సి వచ్చింది. సాయంత్రం 6 గంటలకు సుమారు 30 శాతం పింఛన్ల పంపిణీ కార్యక్రమం పూర్తి అయినట్లు సమాచారం.

పింఛన్ల పంపిణీని వార్డు వలంటీర్లతో కాకుండా సచివాలయ ఉద్యోగులతో ఈ నెల నుంచి పంపిణీ చేయించాలని ఎన్నికల కమిషన్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో పంపిణీలో వార్డు వలంటీర్లు పూర్తిగా దూరంగా ఉన్నారు. సచివాలయంలో పనిచేసే ఉద్యోగులు తమ కార్యాలయాల వద్ద పంపిణీ చేయాలని సూచించింది. నడవలేని వారు, అనారోగ్యంతో మంచంపై ఉండేవారిని ఉద్యోగులు గుర్తించి వారికి ఇళ్ల వద్దే పంపిణీ చేయాలని పేర్కొంది. దీంతో నగదు పంపిణీ ఆలస్యం కావడం, సచివాలయాల వద్ద ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారులు ఉండటంతో పాటు ఇళ్లకు వెళ్లి పంపిణీ చేసే ప్రక్రియ బుధవారం ప్రారంభం కాలేదు. దీంతో ఇళ్ల వద్ద లబ్ధిదారులు తమకు పింఛన్లు ఎప్పటికి అందుతాయోనని వేయికళ్లతో నిరీక్షిస్తున్నారు.



22వ వార్డు సచివాలయంలో పింఛన్ల కోసం వేచి ఉన్న వృద్ధులు

పింఛను కోసం వృద్ధుల పడిగాపులు

తెనాలిరూరల్: వృద్ధాప్యంలో ఆసరాగా నిలుస్తున్న పింఛన్ కోసం పండుటాకులు పడిగాపులు పడాల్సి వచ్చింది. ఇన్నాళ్లు వలంటీర్‌ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారు జామునే పింఛన్‌లు అందుకున్న అవ్వా తాతలు టీడీపీ అధినేత చంద్రబాబు తన అనుచరులతో కలసి చేసిన కుట్రతో ఈ నెల పింఛన్ పొందడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోంది. మండుటెండల్లో పింఛన్ల కోసం గంటల తరబడి ఎదురు చూడాల్సిన దుస్థితి దాపురించడంతో అవ్వా తాతలు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. తమను ఈ వయసులో ఇబ్బందులకు గురి చేసిన వారికి తమ ఉసురు తగలక మానదని శాపనార్థాలు పెట్టుకున్నారు. పింఛన్లు పొందడానికి మరో వారం రోజులు ఇబ్బందులు తప్పవని తెలిసి వృద్ధులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పింఛను కోసం తప్పని తిప్పలు

తెనాలిటౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లోని లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేయడానికి అధికారులు పలు అవస్థలు పడాల్సి వచ్చింది. గ్రామాల్లోని సచివాలయాలకు పింఛన్ తీసుకునే లబ్ధిదారులు బుధవారం ఉదయం 9 గంటలకే సచివాలయాలకు వచ్చారు. మండలంలోని 18 గ్రామాల్లో అన్ని రకాల పింఛన్‌లు కలిపి 11,128 మంది లబ్ధిదారులు ఉన్నట్లు ఎంపీడీవో శిల్ప కానూరి తెలిపారు. ఈ నెల 6వ తేదీ వరకు పింఛన్‌లు గ్రామాల్లోని సచివాలయాల్లో పంపిణీ చేస్తామని చెప్పారు. అందరికి పంపిణీ చేస్తామని ఎవరూ ఇబ్బంది పడవద్దని తెలిపారు.



కొలకలూరు సచివాలయంలో పింఛన్ కోసం క్యూ కట్టిన మహిళలు



6వ వార్డు సచివాలయంలో నిరీక్షిస్తున్న లబ్ధిదారులు



మల్లెపాడు సచివాలయం వద్ద పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు



కొలకలూరు సచివాలయం-1 ఆవరణలో వేచియున్న పింఛనుదారులు

మాపై ఇంత కక్ష ఎందుకు కట్టారు



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి వార్డు వలంటీర్ల ద్వారా ప్రతి నెల పింఛన్ పంపిణీ చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబు వలంటీర్లపై కక్ష పెంచుకుని వారిపై అనేక ఆరోపణలు చేశారు. అంతటితో ఆగకుండా ఆయన అనుచరులతో కేసు వేయించి చివరకు మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నాడు. మా పై ఎందుకు ఇంత కక్ష కట్టారో తెలియటం లేదు. – స్వరాజ్యం, 40వ వార్డు, తెనాలి

మళ్లీ కష్టాలు మొదలు



పింఛన్ల కోసం గతంలో పంపిణీ కేంద్రాల వద్ద రోజుల కొద్దీ వేచి ఉండాల్సి వచ్చేది. జగన్‌బాబు అధికారంలోకి వచ్చిన తరువాత మా కష్టాలను చాలా వరకు తీర్చాడు. వలంటీర్లను ఉదయన్నే ఇంటికి పంపించి పింఛన్లను చేరవేశాడు. ప్రతిపక్ష నాయకులు కక్ష కట్టి మరలా మాకు కష్టాలు తెచ్చి పెట్టారు. గంట నుంచి సచివాలయం వద్ద వేచి ఉన్నా ఇప్పటికీ పింఛన్ అందలేదు. – భానుమతి, 24వ వార్డు, తెనాలి

చంద్రబాబుకు బుద్ధి చెబుతాం



వృద్ధులు, వికలాంగుల కష్టాలను తప్పించేందుకు సామాజిక పింఛన్ల పంపిణీని వలంటీర్లతో ప్రభుత్వం చేయిస్తుంది. నడవలేని మాలాంటి వారి ఇంటికి వలంటీర్లు వచ్చి వాటిని పంపిణీ చేసే వారు. వృద్ధులు అని కనికరం కూడా లేకుండా చంద్రబాబు కేసులు వేయించి పింఛను ఇళ్లకు రాకుండా చేశారు. పింఛను పంపిణీని సచివాలయాల్లో జరిగే విధంగా కుయుక్తులు పన్నారు. మాకు క్షోభకు గురి చేసిన చంద్రబాబుకు ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతాం. – సింహాద్రి పార్వతమ్మ, 23వ వార్డు, తెనాలి.

బీజేపీ, పొత్తు పార్టీలను ఓడించడమే లక్ష్యం

తెనాలి: బీజేపీ, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీలను ఎన్నికల్లో ఓడించటమే మన కర్తవ్యమని, దానిని చక్కగా నిర్వర్తించాలని సీపీఎం తెనాలి ఏరియా కార్యదర్శి కె.బాబూప్రసాద్ స్పష్టం చేశారు. సీపీఎం తెనాలి ఏరియా కమిటీ సర్వసభ్య సమావేశం బుధవారం ఇక్కడి చెంచుపేటలోని ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. ములకా శివసాంబిరెడ్డి అధ్యక్షత వహించారు. బాబూప్రసాద్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ వైఖరిని వివరించారు. 1934లో తెనాలిలో ఏర్పాటైన సీపీఎం పార్టీ శాఖ పార్టీ నాయకుల ఉద్యమాలతో ప్రజలను ఆకర్షించి తెనాలి ప్రాంత అభివృద్ధికి ఆనాడే బీజాలను వేసినట్టు గుర్తుచేశారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్యం స్థానంలో అధ్యక్ష తరహా పాలన తేవటానికి బీజేపీ సన్నాహాల్లో ఉందన్నారు. కార్పొరేట్ కంపెనీలతో బంధాలను ఏర్పరచుకుని, ప్రభుత్వరంగ సంస్థలను అమ్మకానికి పెట్టిందన్నారు. తమ పార్టీ కర్తవ్యం బీజేపీని, ఆ పార్టీతో పొత్తు పెట్టుకున్న పార్టీలను ఓడించటమేనని స్పష్టం చేశారు. షేక్ హుస్సేన్ వలి స్వాగతం పలికారు. పి.జోసేష్ వందన సమర్పణ చేశారు.



మాట్లాడుతున్న బాబూప్రసాద్

సీఎం వైఎస్ జగన్‌కు మద్దతుగా నిలుద్దాం

తెనాలి అర్బన్: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక పేర్కొన్నారు. పట్టణంలోని 17వ వార్డులో బుధవారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి వాటికి సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ఆలమూరి విజయలక్ష్మికుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు టోపీ సుభానీ, కోలా వాసు, జాకీరా, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, మల్లిబోయిన రాము, పల్లె శ్యాముల్, యలవర్తి సాంబశివరావు, అన్సారీ, కుక్కల ముక్తేశ్వరరావు, గోల్డ్ రహీమా, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప, చైర్‌పర్సన్ రాధిక

చంద్రబాబు కూటమికి బుద్ధి చెప్పాలి

వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గుంటూరు కృష్ణ

తెనాలి: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు తన స్వార్థ రాజకీయాల కోసం పింఛనుదారుల జీవితాలతో చెలగాట మాడుతున్నారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి గుంటూరు కృష్ణ బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. విశ్రాంత ఐఏఎస్ అధికారి నిమ్మగడ్డ రమేష్, మరికొందరితో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయించి వలంటీర్లతో పింఛన్ల పంపిణీని చంద్రబాబు అడ్డుకున్నారని ఆరోపించారు. దీని ఫలితంగా బుధవారం ఉదయం పది గంటల నుంచి సచివాలయాలకు చేరుకున్న వృద్ధులు పడిగాపులు కాస్తూ కనిపించారని తెలిపారు. ఇవన్నీ చూస్తుంటే «చంద్రబాబు నవ్వుడు...నవ్వుతూ బతికేవాళ్లను చూస్తే కడుపుమంట» అన్న దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వ్యాఖ్యలు గుర్తుకొస్తున్నాయని పేర్కొన్నారు. చంద్రబాబు కూటమి పేదల ఆగ్రహానికి గురికాక తప్పదన్నారు.

అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం

- ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలి
- నార్త్‌జోన్ డీఎస్పీ రవికాంత్

తాడేపల్లిరూరల్: మే 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని నార్త్ జోన్ డీఎస్పీ రవికాంత్ అన్నారు. బుధవారం రాత్రి తాడేపల్లి పోలీస్‌స్టేషన్ ప్రాంతంలో ఓటుహక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రవికాంత్ మాట్లాడుతూ ఓటు హక్కు వినియోగించుకునేటప్పుడు ఎవరైనా వ్యక్తులు ప్రభావితం చేసినా, బెదిరింపులకు పాల్పడినా అటువంటివారి సమాచారం ఇవ్వాలని, ఓటు హక్కు వున్న ప్రతి ఒక్కరూ తమకు నచ్చిన అభ్యర్థికి ఓటు వేసే హక్కు ఉంటుందని, ఎవరి బలవంతం వల్లో మీ ఓటు హక్కును మీకు ఇష్టం లేకుండా వేరే వారికి వేయవలసిన అవసరం లేదని, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన వారిని ఇప్పటికే బైండోవర్ చేశామని, అలాంటి వారు ఎన్నికల సమయంలో ఎటువంటి గొడవలు పడినా సహించేది లేదని, ప్రతి పోలింగ్ బూత్ దగ్గర ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన అన్నారు.



ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ రవికాంత్

పోలీసుల కవాతు..

తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో పోలకంపాడు, పట్టాభిరామయ్య కాలనీ ప్రాంతాల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో పోలీసులు కవాతు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాడేపల్లి ఎస్ఐలు ప్రతాప్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

జగ్జీవన్ రామ్ విగ్రహాలకు ముసుగులు తొలగించాలి

- కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలి
- డిమాండ్ చేసిన బహుజన నాయకులు

మంగళగిరి: సమాజంలో పేద బడుగు, బలహీన వర్గాల కోసం నిరంతరం పోరాడిన మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ జయంతి ఈ నెల 5వ తేదిన ఘనంగా జరుపుకోవాలని బహుజన నాయకులు కోరారు. పట్టణంలో ఐబీఎస్ భవన్ ప్రెస్ క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో నాయకులు శావల థామస్, ఈపూరి ఆదామ్‌లు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ నేపథ్యంలో జగ్జీవన్ రామ్ విగ్రహాలకు వేసిన ముసుగులను వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5 వ తేదీన పట్టణంలోని బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద నిర్వహించే జయంతి కార్యక్రమంలో బహుజనులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం బాబూ జగ్జీవన్ రామ్‌కు భారతరత్న ప్రకటించాలని కోరారు. బహుజన నాయకులు జాలాది నాగేశ్వరరావు, కుంచాల కృష్ణ కిషోర్, వడ్డేశ్వరపు రజనీకాంత్, మీనిగ ఆంజనేయులు, పులివర్తి రాంబాబు, సాలి ప్రశాంత్, చిలకా విక్టర్ ఇమ్మానుయేలు, బండపల్లి బాపయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానాభివృద్ధి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో చదువును ఆచరణలోకి తెచ్చినప్పుడే విజ్ఞానం అభివృద్ధి చెందుతుందని ఇస్రో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ బి.నాగేశ్వరరావు పేర్కొన్నారు. అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ఇన్నోవేషన్ ఫెయిర్-2024 నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి విద్యార్థిలో సృజనాత్మక ఆలోచనలు కచ్చితంగా ఉంటాయని, వాటిని వెలుగులోకి తీసుకురావడంలో ఇటువంటి సాంకేతిక ప్రదర్శనలు దోహదం చేస్తాయని తెలిపారు. విద్యార్థుల్లో శాస్త్ర, సాంకేతిక విజ్ఞానాన్ని అభివృద్ధి పరచి, నూతన ఆవిష్కరణల దిశగా ప్రోత్సహించడంలో కళాశాలల యాజమాన్యాలు కృషి చేయాలని సూచించారు. కళాశాల కార్యదర్శి చెరువు రామకృష్ణమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల్లో విజ్ఞానంతో పాటు వివరణాత్మక, విశ్లేషణ సామర్థ్యం ఉండాలని సూచించారు. రెండు రోజుల పాటు జరగనున్న ఇన్నోవేషన్ ఫెయిర్‌లో భాగంగా ప్రాజెక్టు ఎక్స్‌పో, పోస్టర్, పేపర్ ప్రజెంటేషన్‌ను నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి. ఐజక్ ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు, వైస్ ప్రిన్సిపాల్ వజ్రాల నర్సిరెడ్డి, కన్వీనర్ ఎస్. కృష్ణార్జునరావు పాల్గొన్నారు.



విశ్రాంత ఇస్రో శాస్త్రవేత్త నాగేశ్వరరావును సత్కరిస్తున్న రామకృష్ణమూర్తి, ఐజక్ ప్రసాద్, సుబ్బారావు

అడ్డరోడ్డులో రూ.2.90 లక్షల నగదు స్వాధీనం

ద్విచక్ర వాహనంపై తీసుకెళుతుండగా స్వాధీనం చేసుకున్న పోలీసులు

తాడికొండ: ఎలాంటి బిల్లులు లేకుండా నగదు తీసుకెళుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని రూ. 2.90 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నట్లు తాడికొండ సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. ఎస్ఐ రవీంద్ర బాబు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి తనిఖీలు నిర్వహిస్తుండగా అమరావతి మండలం మునగోడు గ్రామానికి చెందిన షేక్ జానీబాషా తన బైక్‌లో రూ.2.90 లక్షల నగదు పెట్టుకొని వెళుతున్నాడు. విచారించగా అందుకు సంబంధించిన ఎలాంటి బిల్లులు లేవని తెలిపిన నేపథ్యంలో ఫ్లెయింగ్ స్క్వాడ్‌కు సమాచారం అందించి, అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నగదును ఐటీ అధికారులకు స్వాధీనం చేయనున్నట్లు సీఐ తెలిపారు.



భక్తులకు క్రీస్తు పునరుత్థాన ఆశీర్వాదాలు

ఫిరంగిపురం: మండలకేంద్రంలోని రాజాపేట, రసూల్‌పేట, కొత్తపేట, కొండమెట్ల బజార్, తూర్పుబజార్ ప్రాంతాల్లో బుధవారం క్రైస్తవులకు క్రీస్తు పునరుత్థాన ఆశీర్వాదాలు బాల ఏసు దేవాలయ విచారణ గురువులు పి.బాలస్వామి, మరికొందరు ఫాదర్లు అందజేశారు. క్రైస్తవ భక్తుల ఇంటింటికి ఫాదర్లు వెళ్లి వారిని పరిశుద్ధ జలంతో ఆశీర్వదించారు. దీనిద్వారా ఆయా కుటుంబాల్లో సంతోషాలు వెల్లువిరుస్తాయని, క్రీస్తు ఆశీస్సులు ఎల్లప్పుడు వారికి ఉంటాయని చెప్పారు. ఫాదర్లు ఆర్.అనిల్ కుమార్, విలియమ్, వినోద్, చంద్రశేఖర్, డీకన్ బాల, డీకన్ జీవన్‌లు ఉన్నారు.



టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

తెనాలిటౌన్: తెనాలి రూరల్ మండలం నందవెలుగు గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు బొడ్డు భాస్కరరావు, బొడ్డు రాఘవేంద్రరావులు బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీలో చేరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ, నియోజకవర్గ పరిశీలకులు మందపాటి శేషగిరిరావు, పార్టీ నాయకులు గ్రామంలో ప్రచారం చేస్తున్నారు. వీరి సమక్షంలో భాస్కరరావు, రాఘవేంద్రరావులకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సంక్షేమం కోసం సీఎం జగన్ పని చేస్తున్నారని రాబోయేది మళ్లీ జగన్ ప్రభుత్వమేనని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ దూళిపాళ్ల పవన్‌కుమార్, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కన్వీనర్ కానుగోలు సురేష్, బొంతు నరేంద్ర రెడ్డి, ప్రసాదం బాలగురవమ్మ, పినపాటి అనిల్‌కుమార్, వేముల మహేష్, తోటకూర సుబ్రమణ్యం, వసంతరావు, గొర్రె వెంకటేశ్వరరావు, నవనీతం నాగేశ్వరరావు, దానబోయిన శ్రీనివాసరావు, బెజ్జం బాజి, మంగా చిట్టిబాబు, కసుకుర్తి దానియేలు, దుర్గాప్రసాద్, బాలగోపి, మంగా శివనాగేశ్వరరావు, శాంతిరాజు, కొండమూది విజయ్, వీరమల్లు కార్తికేయ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్టా మహోత్సవం



తెనాలి టౌన్: పట్టణ గంగానమ్మపేటలోని శ్రీ కృష్ణ మందిరంలో నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. మందిరంలో గోపాల కృష్ణస్వామి, విజయ గణపతి, సాయిబాబా నూతన విగ్రహాలను శాస్త్రోక్తంగా ప్రతిష్టించారు. శిఖర ప్రతిష్ట మహోత్సవం జరిపారు. సమాది బాలకృష్ణ, సమాది మహేష్ ఫ్రెండ్స్ సర్కిల్, శ్రీకృష్ణ భక్త బృందం సభ్యులు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ డాక్టర్ తాడిబోయిన మస్తానమ్మ, డాక్టర్ అవినాష్, భక్తులు మందిరంలో విశేష పూజలు జరిపారు. అనంతరం భక్తులకు అన్న సమారాధన నిర్వహించారు.

శివదుర్గాపురంలో ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్‌నగర్ అంబేద్కర్ కాలనీలో వున్న అర్బన్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో బుధవారం శివదుర్గాపురంలో ఆరోగ్య సురక్ష - 3 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్యులు డాక్టర్ మానస పర్యవేక్షణలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్, గైనకాలజిస్ట్ డాక్టర్లు పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మానస మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించామని, ఈ కార్యక్రమంలో 270 మంది వివిధ ఆరోగ్య సమస్యలతో శిబిరానికి విచ్చేశారని, వారందరికీ వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశామని, ఇద్దరికి కంటి ఆపరేషన్లు చేయాల్సి ఉండడంతో పెదకాకాని శంకర కంటి ఆసుపత్రికి సిఫార్సు చేశామని ఆమె తెలిపారు. ఆసుపత్రి సిబ్బందితో పాటు ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.